## క్లుప్తంగా

### ఏఎంసీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



ముప్ప గంగారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మోపాల్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డికి ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స కావడంతో విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సోమవారం తన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

### గంగమ్మతల్లి ఆలయం ప్రారంభం



ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

ఇందల్వాయి: ఎల్లారెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి రూ. 40 లక్షల నిధులు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామం నుంచి ఆలయం వరకు రోడ్డు కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, కర్నం మోహన్, సంతోష్ రెడ్డి, సుధాకర్, ఆశిష్, ధర్పల్లి అధ్యక్షుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### కరాచీ బేకరీపై దాడి సరికాదు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో కరాచీ పేరుతో ఉన్న బేకరీపై బీజేపీ నాయకులు దాడి చేయడం సరైంది కాదని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖైసర్ అన్నారు. సోమవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. కరాచీ పేరు 1950 నుంచే నడుస్తోందని, ఈ బేకరీని రాజేశ్, హరీశ్‌లు నడుపుతున్నారని పేర్కొన్నారు. పాకిస్తాన్‌లో కూడా సర్దార్‌వల్లభాయ్ పటేల్ రోడ్, గాంధీ రోడ్, లక్ష్మి రోడ్ తదితర ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. ఆస్తి నష్టం చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ శాంతియుతంగా ఉండాలన్నారు.

### ఘనంగా అర్బన్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, కన్యకా పరమేశ్వరి, నీలకంఠేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఖలీల్‌వాడిలో మొక్కలు నాటారు. జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ధన్‌పాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో..**

ఖలీల్‌వాడి: న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్, నాయకులు రాజ్ కుమార్ సుబేదార్, పిల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అవకాశం కల్పించాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యశాఖ, జీజీహెచ్ పరిధిలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేసిన స్టాఫ్ నర్సులకు రిక్రూట్‌మెంట్‌లో అవకాశం కల్పించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సమీర్ అహ్మద్ సీఎం కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. వైద్య శాఖలో ఎన్‌హెచ్ఎం కింద రిక్రూట్‌మెంట్ జరుగుతోందని కరోనా సమయంలో పనిచేసిన స్టాఫ్ నర్సులకు భర్తీ ప్రక్రియలో అవకాశం కల్పించాలన్నారు. ఏళ్ల తరబడిగా సేవలందించిన వారికి న్యాయం చేయాలని కోరారు.

# అద్దె భవనాల్లోనే కార్యాలయాలు

- కిరాయి చెల్లించక పోవడంతో తాళాలు
- తహసీల్, మండల పరిషత్, ఎంఆర్‌సీ, పోలీస్‌స్టేషన్ కూడా..
- ఎనిమిదేళ్లుగా అరకొర గదుల్లోనే పాలన
- సమీకృత భవన సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు..!

ప్రజావసరాలను తీర్చే ప్రభుత్వ అధికారులు కొలువై ఉండే సర్కారీ కార్యాలయాలు అద్దె గదుల్లో, అధ్వాన పరిస్థితుల మధ్య కొనసాగుతున్నాయి. ఉద్యోగులకు నీడ కరువైంది. ఏళ్ల గడుస్తున్నా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు సాగిస్తున్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఒంటికి, రెంటికీ వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



మోపాల్ తహసీల్ కార్యాలయం

మోపాల్: మోపాల్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు పూర్తి కావస్తున్నా ఇంకా ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. తహసీల్, మండల ప్రజా పరిషత్, ఎంఈవో, పోలీస్‌స్టేషన్, ఐకేపీ, ఈజీఎస్ కార్యాలయాలకు నేటికీ పక్కా భవనాలు లేవు. వివిధ రకాల పనుల నిమిత్తం కార్యాలయాలకు వస్తున్న ప్రజలకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు అద్దె చెల్లించకపోవడంతో తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలకు భవన యజమాని పలుమార్లు తాళాలు వేసిన ఘటనలు ఉన్నాయి. మండల కేంద్రంలో సమీకృత భవన సముదాయం నిర్మాణానికి ఎకరం స్థలాన్ని ప్రతిపాదించారు. ఎంఈవో కార్యాలయ నిర్మాణానికి 5 గుంటల స్థలానికి ప్రతిపాదనలు పంపించారు. వీటికి కలెక్టర్ కార్యాలయం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

**కార్యాలయాలకు తాళాలు..!**

మండల కేంద్రంలో తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఐకేపీ, ఈజీఎస్ పలు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలకు అద్దె సక్రమంగా చెల్లించక పోవడంతో యజమాని పలుమార్లు తాళాలు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కా భవనాలు ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్ భవన అగ్రిమెంట్ కూడా పూర్తి కావచ్చినట్లు తెలిసింది. పోలీస్‌స్టేషన్‌కు స్థలం కేటాయించినా.. నిధులు లేక నిర్మాణం జరగడం లేదని సమాచారం. తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలకు నెలకు రూ. పది వేల చొప్పున, పోలీస్‌స్టేషన్‌కు రూ. పన్నెండు వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు.

**కనీస వసతులు కరువు**

మోపాల్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ రకాల పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు లేవు. కూర్చోడానికి స్థలం, తాగడానికి నీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతర ఏ రకమైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాల్లో కొనసాగడం వల్ల తామేమీ సమకూర్చలేక పోతున్నామని అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ సమీకృత భవన సముదాయాన్ని త్వరగా నిర్మించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

సమీకృత భవన సముదాయం నిర్మాణానికి మండల కేంద్రంలో ఎకరం స్థలం ప్రతిపాదించాం. ఇటీవల ఎంఈవో కార్యాలయానికి ఐదు గుంటల స్థలం కేటాయించాం.కలెక్టర్ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అద్దెను ఎప్పటికప్పుడు క్లియర్ చేసేలా చర్యలు తీసుకున్నాం. – రామేశ్వర్, తహసీల్దార్




మండల ప్రజాపరిషత్ కార్యాలయం




మోపాల్ పోలీస్‌స్టేషన్

## అనుమతుల్లేని కోచింగ్ సెంటర్లను మూసివేయాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని కోచింగ్ సెంటర్లను మూసివేయాలని విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ.. అనేక కోర్సుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ. వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలోని వినాయక్‌నగర్, కంఠేశ్వర్, అర్సపల్లి ప్రాంతాల్లోని అద్దె భవనాల్లో కనీస వసతులు లేకుండా 200 పైగా ఈ కోచింగ్ సెంటర్స్ యథేచ్ఛగా కొనసాగుతున్నాయని అన్నారు. ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతులు లేని కోచింగ్ సెంటర్లను మూసివేయాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్, జ్వాల, అంజలి, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకర్

డిచ్‌పల్లి: వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. సోమవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతసదన్ లో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్ లో చదువుతున్న 6 నుంచి 9వ తరగతి బాల, బాలికలకు ఈ శిబిరంలో నృత్యం, చిత్రలేఖనం, కరాటే, యోగా, సింగింగ్, మాథ్స్ బేసిక్స్, కంప్యూటర్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 15 రోజుల పాటు ఈ వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి గెజిటెడ్ హెచ్ఎం సీతయ్య, క్యాంప్ కో–ఆర్డినేటర్ రమేశ్, ఇన్‌స్ట్రక్టర్స్ అజయ్, కల్పన, పాషా, విజయలక్ష్మి, ఎంబీఎస్ ప్రసాద్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–2001 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాతికేళ్ల తర్వాత ఒక చోట కలిసిన మిత్రులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## వైభవంగా లక్ష్మీనృసింహుల కల్యాణం



స్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న పండితులు



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి పాలరాతి దేవాలయంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహ స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం 11 గంటలకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణాన్ని ఆలయ ప్రధానార్చకులు వడియాల్ రవికుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు కందాళై రాజగోపాలచారి, రొట్టె సురేశ్ శర్మ వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పండితులు అరుణ్ కుమార్ శర్మ, సాయి శంకర్ శర్మ, దేవిదాస్ రావు, ప్రవీణ్, భక్తులు పాల్గొన్నారు.

### ఆలయంలో అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న సభ్యులు

నిజామాబాద్ రూరల్: నగరంలో బొడ్డెమ్మ చెరువు సమీపంలో ఉన్న మహాగణపతి ఆలయంలో సోమవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా భక్తులు స్వామివారికి అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఆలయ అర్చకుడు సంజీవ్ శర్మ,ఆలయ చైర్మన్ చిలుముల భూషణ్‌చారి, కమిటీ సభ్యులు శ్రీనివాస్, మురళి, శ్రావణ్, రవిచారి,భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా బీరప్ప ఉత్సవాలు



సిరికొండ: మండల కేంద్రంలో గొల్ల, కుర్మల ఆరాధ్య దైవం బీరప్ప ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయం ఎదుట పట్నాలు వేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఒగ్గు కళాకారులు పాటలు, నృత్యాలతో అలరించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గౌతమ బుద్ధ పౌర్ణమి



గౌతమబుద్ధ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

నిజామాబాద్ నాగారం: నగరంలోని పోచమ్మగల్లీ ఎస్సీ మాల సంఘం ఆధ్వర్యంలో సోమవారం గౌతమ బుద్ధ పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతమ బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘ సభ్యులు మాట్లాడుతూ.. శాంతిని వెతికే ప్రతి మనిషి బుద్ధిని మార్గానికి రాక తప్పదని అన్నారు. మనుషుల మధ్య ఉన్న అసమానతలను తొలగించి, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని కోరుతూ, చల్లని చిరునవ్వుతో బుద్ధుడు పరితపించారని తెలిపారు. బుద్ధుని బోధనలు విస్తృతంగా ప్రసారం చేయాలన్నారు. చెడు మార్గాన్ని విడనాడి గౌతమ బుద్ధుని ఆలోచన విధానాన్ని, అంబేడ్కర్ అందించిన మార్గాన్ని అనుసరించిన నాడే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ పులి జైపాల్, కార్యదర్శి నీలగిరి సాయికిరణ్, రాజేంద్ర ప్రసాద్, సునీల్, రాకేశ్, గంగాధర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### డిగ్రీ అడ్మిషన్లకు దోస్త్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నిజామాబాద్‌అర్బన్: డిగ్రీ అడ్మిషన్లకు దోస్త్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని నిజామాబాద్ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సైదా జైనబ్ అన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ల కోసం ఈ నెల 21 లోపు దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. 29న అడ్మిషన్లు, కళాశాలల కేటాయింపు, జాబితా విడుదలవుతుందని అన్నారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అవుతుందని పేర్కొన్నారు.

### ఇసుక ట్రాక్టర్లు పట్టివేత




మోపాల్: మండలంలోని బాడ్సి పెద్ద వాగులో నుంచి ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. వడ్డెరకాలనీకి చెందిన ఎత్తిరి దుర్గయ్య, కాస్‌బాగ్ తండాకు చెందిన ప్రకాశ్ ట్రాక్టర్లు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## సినిమాలు

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | సింగిల్ -11.00, 4.40 |
| | హిట్-1.30, 7.30 |
| | జగదేకవీరుడు అతిలోక సుందరి-10.30 |
| స్క్రీన్-2 | సింగిల్-1.30, 7.30, 10.30 |
| స్క్రీన్-3 | జగదేకవీరుడు అతిలోక సుందరి-11.00, 4.30 |
| | శుభం-1.40, 7.20, 10.20 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | సచిన్-11.20, |
| | సింగిల్-1.40, 7.25, 10.10 -రైడ్-2(హిందీ)-4.25 |
| స్క్రీన్-2 | తుడరుమ్-11.20 |
| | శుభం-2.40, 5.20, 8.00, 10.40 |
| స్క్రీన్-3 | జర్నీ-11.00 - రైడ్-2(హిందీ)-1.45 |
| | కలియుగం-8.00 - హిట్-4.45, 10.25 |
| స్క్రీన్ -4 | సీఎం పెళ్లాం-11.40 |
| | జగదేకవీరుడు అతిలోకసుందరి-2.30 |
| | బ్లైండ్‌స్పాట్-5.40- రైడ్-2(హిందీ)-7.45 |
| | తుడరుమ్-10.40 |

లలితామహల్ శుభం   దేవి సింగిల్

నటరాజ్ జగదేకవీరుడు అతిలోకసుందరి

విజయ్ హిట్

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 97,000 | వెండి(కిలో) | 1,01,000 |
| 22 క్యారెట్స్ | 89,540 | | |

– నిజామాబాద్ బిజినెస్

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 190 |
| | | లైవ్ | 160 |
| స్కిన్‌లెస్ | 220 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 8 | 15 | గాజరుగడ్డ | 30 | 60 |
| బెండకాయ | 30 | 50 | పచ్చిమిర్చి | 30 | 50 |
| బీరకాయ | 40 | 60 | దోసకాయ | 20 | 40 |
| దొండకాయ | 25 | 40 | ఆలుగడ్డ | 25 | 50 |
| బీర్నీసుకాయ | 100 | 150 | గోబిగడ్డ | 10 | 20 |
| కాకరకాయ | 30 | 50 | గోబిపువ్వు | 30 | 50 |
| వంకాయ | 30 | 50 | బీట్‌రూట్ | 25 | 50 |
| పాలకూర | 20 | 40 | కరివేపాకు | 40 | 60 |
| మెంతికూర | 60 | 90 | చామగడ్డ | 40 | 60 |
| కొత్తిమీర | 50 | 80 | గోరుచిక్కుడు | 40 | 60 |
| పుదీనా | 50 | 80 | చిక్కుడుకాయ | 40 | 60 |
| క్యాప్సికం | 40 | 80 | మామిడికాయ | 30 | 50 |

–సుభాష్‌నగర్

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

వర్ని: అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో వెల్లడించారు. సోమవారం పొట్టిగుట్టలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని, తప్పులకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్ని ఎంపీడీవో మారుతి, సతీశ్, శ్రీకాంత్, ముస్తాక్ హుస్సేన్ పాల్గొన్నారు.

## బంజారా భాషలో ప్రసారాలు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌లాల్

నిజామాబాద్ రూరల్: బంజారా భాషలో ప్రసారాలు కావాలని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. సోమవారం వినాయక్‌నగర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆకాశవాణి దూరదర్శన్‌లో బంజారా భాషలో ప్రసారాలు లేకపోవడం వలన అవి అర్థం కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను బంజారా భాషలో ప్రసారం చేయాలని కోరారు. సభ్యులు వేముల శేఖర్, మురళి పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది నర్సులతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. నర్సుల వృత్తికి గౌరవాన్ని, ఖ్యాతిని తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల కృషి, సేవ అమోఘమని కొనియాడారు. విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మర్చిపోరని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్స్ మమత, సృజన, సిబ్బంది కృష్ణ, పద్మ, సంతోష్, సురేశ్, నరేందర్ పాల్గొన్నారు.